# శిష్య దక్షిణ

-డా॥ కేతు బుచ్చిరెడ్డి

కడప బస్టాండు కిటకిటలాడుతోంది - అటు ఇటు తిరుగుతున్న ప్రయాణీకులతో, అడ్డొస్తూ అవీ ఇవీ అమ్మే చిల్లర వర్తకులతో, వచ్చీపోయే బస్సులతో,

'నమస్కారం' అన్న పలకరింపు విని పక్కకు చూసాను. ఓ యువకుడు ముకుళిత హస్తాలతో మరోసారి "నమస్కారం సార్!" అన్నాడు. ఎగాదిగా చూసాను. మర్యాద కోసం 'నమస్కారం' అన్నాను. అతనెవరో గుర్తుకు రావటంలేదు. కానీ ఎక్కడో, ఎప్పుడో చూసినట్లుంది. "మీరెవరో తెలియదు" అన్నట్లు ముఖం పెడితే అతను బాధపడతాడని, మామూలుగానే కాస్త నవ్వు ముఖం పెట్టాను.

"ఇంకా అనంతపురం గవర్నమెంటు కాలేజిలోనే పనిచేస్తున్నారా, సార్?" అన్నాడు.

"ఆc! అక్కడే" అన్నాను. పట్టేశాను, కనిపెట్టేశాను, అతను గతంలో నా స్టూడెంటని.

"నేను మీ స్టూడెంటుని, బిఏలో ఇహెచ్‌పి గ్రూప్ సార్" అన్నాడా యువకుడు.

"నీ పేరు?"

"నాగరాజు"

నిజం చెప్పాలంటే అతను అంత బాగా గుర్తులేదు. మర్యాద కోసం మాట కలపాలిగదాని, ఏవేవో కాలేజి వివరాలు అడిగాను. అన్నీ కరెక్టుగా చెప్పడం, ఒక్కొక్క సంఘటనతో, సమాచారంతో అతను నా శిష్యుడన్న విషయం రూఢి అయి, ఆ భావం బంధంగా మారింది. కాలేజిలో, క్లాసులో లేని చనువు, సాన్నిహిత్యం బస్టాండులో కలగడంతో మనసులోనే నవ్వుకున్నాను.

"ఈ బెంచి మీద కూర్చోండి సార్" అంటూ కర్చీఫ్‌తో బెంచి శుభ్రం చేసాడు నాగరాజు.

నేను కూర్చున్నాక, "ఇప్పుడే వస్తాను సార్" అంటూ అటువైపు వెళ్లాడు.

పది నిమిషాల్లో తిరిగి వచ్చాడు నాగరాజు, కాఫీ పట్టుకొని.

"ఆc ఎందుకీ మర్యాదలు" అంటూ మొహమాటంతోనైనా, కాఫీ అంటే ఇష్టం కాబట్టి, లోపల మనసులో సంతోషంతో తీసుకొని తాగాను. ఖాళీ కప్పు అందుకుంటూ, జేబులోంచి సిగరెట్, అగ్గిపెట్టె ఇచ్చాడు నాగరాజు. సిగరెట్ ముట్టించి, అగ్గిపెట్టె అతని చేతిలో పెట్టాను. 'కాఫీ, సిగరెట్ అంటే నాకు ప్రాణమని

## గ్లోబల్ మార్కెట్

ఛిద్రమైన బ్రతుకులు
చిందర వందర అవుతూనే ఉన్నాయి
ఛీ పోమన్నా శనిదేవత
వదలనని మారం చేస్తుందేమో
ధనదేవతను చూసి
వణుకుతూ భయపడుతుందేమో..
ఇప్పుడు సమయం మించి పోయింది
సంధి చేసుకునేందుకు అవకాశమే లేకపోయింది.
కవిత్వం తన్మయత్వాన్ని వదిలింది
కవి హృదయం పగిలి చాలా సేపయింది.
అయినా దారి ప్రక్కన బతుకులు
ఎవరిక్కావాలి? దారిలోని గోతులు తప్ప!
ఏడుపులు ఆకలి మంటలు
కొందరి జీవితాల్లో ఆనందడోలికలు
విలువలు అంతర్జాతీయ మార్కెట్‌లో బేరం పెడితే
రేటు డాలర్‌లో బాగానే వచ్చింది.
అర్ధ నగ్నత్వం చూసి ఇక బోరుకొడుతుంది.
నగ్నత్వం అయితే బాగుంటుందనిపిస్తుంది.
అరిచే గొంతులు ఎత్తే చేతులు
చూస్తుండగానే మాయమయ్యాయి.
క్రాంతి చీకటికి భయపడే రోజులు
కాంతి కోసం ఇక మొదలయ్యాయి పడిగాపులు
గమ్యం క్వశ్చన్ మార్క్
జగతి పయనం గ్లోబల్ మార్కెట్!

-పైడిపల్లి చైతన్య

## చదవడమంటూ మొదలుపెడితే..!

ఎప్పటినుంచో కొనసాగుతున్న
గాఢ పరిచయమొకటి
పుస్తక రూపంలో తొంగి చూస్తోంది
ముఖచిత్రాన్ని ఆత్రంగా తడిమి చూస్తుంటే
ప్రాణమిత్రుడితో కరచాలనం చేస్తున్నంత
సంబరంగా ఉంది
తీరిక వేళల్లో పుస్తకాన్ని చదివి
పారవశ్యంతో తాదాత్మ్యం చెందడం కన్నా
గొప్ప అనుభూతి ఇంకేముంటుంది?
అధ్యయనం ఒక నిరంతర ప్రవాహం
ప్రశాంత ఘడియల్లోనూ నిద్రపట్టని సమయాల
లోనూ
రాత్రివేళల్లోనూ
ఈ పఠనాభిలాషే సేద తీరుస్తుంటుంది
ఎన్ని బోసిమెదళ్ల ఆలోచనలకు పదునుపెట్టి
అక్షరాల వెలుగుల్ని పంచి ఇచ్చిందో
మననం చేసుకుంటున్న కొద్దీ
బతుకు లోతుల్ని తవ్వుతూనే ఉంది.
కాగితపు కొసల స్పర్శ
చేతివేళ్ల అంచులను తాకినా చాలు
మనసు పేజీలు వాటంతటవే తిరగబడుతూ
ఆత్మపరిశీలనలో మునిగిపోతాయి
అక్షరాల వేటలో నిమగ్నమైనపుడు
గురిచూసి విసురుతున్న చూపులు
నన్నో పఠన విలుకాణ్ణి చేస్తాయి
చెల్లాచెదురవుతున్న ఊహలతో పాటు
అనుభవాలన్నింటిని మథించి పిండుతూ
దృశ్యంగా మనసు పొరల మధ్య పరుస్తాను
లోలోపల సాగే సంభాషణల ఫలితంగా
బహిరంతర ఊగిసలాట మొదలై
జీవితం సంఘర్షణాత్మక సందర్భమవుతుంది
అప్పుడు
లోపల ప్రపంచం కంటే
బయట ప్రపంచమే ఎంతో చిన్నదనిపిస్తుంది
నిట్టూర్చిన హృదయంతో
నిజాన్ని హత్తుకోవాలని చూస్తాను
ఏదో తెలియని రహస్యం
మిగిలిపోయినట్టుగా అనిపిస్తుంది
మళ్లీ ఇప్పుడు కొత్తగా
చదవడమంటూ మొదలుపెడితే
ఎన్ని రోజులైనా ఎన్ని మాసాలైనా
ఏళ్ల తరబడైనా
ఒక జీవితకాలమైనా
కడదాకా
ఎదురు చూడాల్సిందే!

–మానాపురం
రాజా చంద్రశేఖర్

తెలుసుకొని, ఈ రెండూ అందించినందుకు నాగరాజంటే నాకు ఇంకా దగ్గరయ్యాడు. గురువును చూసి ముఖం చాటేసే శిష్యులున్న ఈ రోజుల్లో.. గురువుకింత మర్యాద చేస్తున్న నాగరాజు లాంటివాళ్లు, ఇంకా చెదురు మదురుగా ఒకరో ఇద్దరో వున్నందుకు ఆనందమైంది.

కాఫీ కప్పు కాంటీన్‌లో పెట్టేసి, కాసేపటికి తిరిగొచ్చి నా ప్రక్కన నిల్చున్నాడు నాగరాజు. కూర్చో మన్నాను. "ఫర్వాలేదు సార్. మీరు మా లెక్చరరు. మీ దగ్గర కూర్చోడం బాగుండదు" అని నిలుచుండి పోయాడు. స్టూడెంట్‌ని చూసి లెక్చరరు భయపడి పక్కకు తప్పుకునే ఈ రోజుల్లో నాకు నాగరాజు బాగా నచ్చాడు.

వాచ్ చూసుకున్నాను. మూడున్నర గంటలైంది. పడమటి దిక్కుకు వాలిన సూర్యుని ఎండ బస్టాండు ఫ్లాట్‌ఫాం పాలిష్‌బండల మీద పడి మెరుస్తోంది.

"రాజంపేట-అనంతపురం' బస్సు ఇపుడు వస్తుంది లెండి సార్" అన్నాడు నాగరాజు.

"రష్ ఎక్కువ వుంటుందేమో? సీటు దొరుకుతుందో లేదో?!" అన్నాను నేను ఆదుర్దాగా.

"నేనున్నాను గదా, దూరిపోయి సీటు పెడతాను. మీరు వర్రీ కాకండి సార్" అన్నాడతను.

బస్ వచ్చేవరకు నిలుచునే మాట్లాడుతున్నాడు నాగరాజు. నన్ను పొగడుతూ– క్లాసులో రాగయుక్తంగా నేను పద్యాలు పాడటం, శ్రీశ్రీ, తిలక్ కవితలని భావా వేశంతో చదవటం, విశ్లేషించటం తనకెంతో నచ్చినట్లు చెప్పాడు.

"మీరు తెలుగు సాహిత్యం పట్ల కల్గించిన ఆసక్తి, ఇచ్చిన స్ఫూర్తితో తెలుగు ఎం.ఏ.లో యూనివర్సిటీ ఫస్ట్ వచ్చాను" అన్నాడు సంతోషాన్ని, కృతజ్ఞతను కల గలిపి తెలుపుతున్నట్లు.

ఇంతలో 'రాజంపేట-అనంతపురం' బస్సు వచ్చింది– నిండు గర్భిణిలా.

నా బ్రీఫ్‌కేసు అందుకొని రివ్వున బాణంలా దూసుకొని బస్సు దగ్గరికి పరిగెత్తాడు నాగరాజు. నేను అతనిని అనుసరించాను. జనం బిలబిలమంటూ బస్సు దగ్గరికి చేరారు. దిగేవాళ్లతో, ఎక్కడానికి తోసుకొని ఎగబడుతున్న ప్రయాణీకులతో ఒకటే రద్దీగా వుంది. దిగుతున్న ఓ ప్రయాణీకునికి కిటికీలోంచి చేతిగుడ్డ ఇచ్చి సీటు పెట్టమని, బ్రీఫ్‌కేసుతో, పద్మవ్యూహంలోకి చొచ్చుకుపోయిన అభిమన్యుడిలా జనంలోకి తోసుకు పోయి బస్సులో దూరాడు. చాలామంది సీట్లు లేక

నిలుచున్నారు. శిష్యుడు సంపాదించిన సీటులో కూర్చున్న నాకు గర్వము, సంతోషం ఉప్పొంగింది. బస్సులోంచి జనాన్ని తోసుకుంటూ కాసేపటికి దిగివచ్చి నా సీటు దగ్గర బయట కిటికీ వద్ద నిలుచున్నాడు. అతని కర్చీఫ్ అందించాను. తీసుకొని, తలవంచుకున్నాడు. దిగాలుగా వున్నాడు. బహుశా ఇంతసేపు కబుర్లు చెప్పుకొని, ఇప్పుడు విడిపోతున్నందుకు, మళ్లీ ఎపుడో కలిసేది అనుకొని బాధపడుతున్నాడేమో పాపం అనుకున్నాను.

"ఈ రద్దీలో నా పర్సు ఎవరో కొట్టేశారు సార్. ఇపుడు అర్జంట్‌గా హైదరాబాదు వెళ్లాలి. మా అమ్మకు బాగాలేదు. ఆస్పత్రిలో వుంది" అన్నాడు.

"అయ్యో!" అన్నాను ఆటోమాటిక్‌గా.

"ఎనభై రూపాయలుంటే ఇవ్వండి సార్. మళ్లీ మీకు మనియార్డరు చేస్తాను" అన్నాడు.

'కాదు-లేదు' అనలేని స్థితిలో మర్యాద, మొహమాటంలో నేనున్నాను.

'ఫర్వాలేదు, తీసుకో' అంటూ డబ్బు ఇచ్చాను.

తీసుకుంటూ, "మీ అడ్రసు వ్రాసి ఇవ్వండి సార్" అన్నాడు. ఒక చిన్న కాగితం, బాల్ పెన్ను తనే ఇస్తూ. వ్రాసిచ్చాను.

హారన్ కొట్టి, బస్ స్టార్టు చేశాడు డ్రైవరు. కండక్టరు తలుపు వేశాడు.

"వెళ్లొస్తాను" అన్నాను నేను.

"మంచిది. నమస్కారం సార్" అన్నాడు నాగరాజు రెండు చేతులు జోడిస్తూ.

❖ ❖ ❖

కొన్ని రోజుల తర్వాత ఒకరోజు-

మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చిన నాకు జాబు ఒకటి అందించి వంటింట్లోకి వెళ్లింది నా శ్రీమతి లక్ష్మి. అది ఇన్‌లాండ్ లెటరు. చేతి వ్రాత అపరిచితంగా వుందనుకొంటూ, తెరచి చదవటం మొదలు పెట్టాను.

"నమస్కారం సార్!

కడప బస్టాండు- ఎనభై రూపాయల అప్పు- నేనెవరో గుర్తొచ్చానా సార్! ఎంఏ పాసయి అయిదేళ్లుగా నిరుద్యోగిని. చదువుకు- అర్హతకు సంబంధం వున్నా లేకున్నా అన్ని ఉద్యోగాలకు అప్లయి చేశాను. అన్ని ఇంటర్వ్యూలకు హాజరయ్యాను. కొన్నాళ్లు మా ఇంట్లో వాళ్లు అప్లికేషన్స్‌కు, ఇంటర్వ్యూలకు డబ్బు ఇచ్చారు. చివరికి ఆశ వదులుకున్నారు. చెట్టంత కొడుకు చేతికి వస్తాడని ఆశించిన నా ముసలి తలిదండ్రులు, కొడుకు చెట్టూ, పుట్టల పాలయ్యాడని కుమిలిపోతున్నారు. అప్లికేషన్స్‌కు పెట్టే ఖర్చుతో ఓ పూట గడుస్తుందనే స్థితిలో నా ఉద్యోగ ప్రయత్నానికి కూడా సాయపడలేకున్నారు. "ఇన్నేళ్లు పెట్టింది చాలు, ఇల్లు గుల్లచేసుకున్నాం" అని ముఖం మీద గుద్దినట్లు చెప్పలేకపోయినా, ఇంకా నాకు తిండి పెట్టలేని దౌర్భాగ్య స్థితి మా వాళ్లది. ఈ పరిస్థితుల్లో అప్పు అని చెప్పి మోసం చేసి ఎనభై రూపాయలు మీ దగ్గర తీసుకున్నాను. నా తిండికి, ఉద్యోగాన్వేషణకి ఇది తప్పనిసరి తప్పు. ఇదే నా సంపాదనా మార్గమయింది. ఈ మార్గం గుట్టు బట్టబయలైతే, మూసివేయబడితే, ఇంకో మార్గం కనిపెడతా. అవసరాన్ని బట్టి నా మార్గం, నా పద్ధతి 'మోడస్ ఆపరాండి' మారుతూ ఉంటుంది. ఇలా సేకరించిన డబ్బు వివరాలు, వ్యక్తుల అడ్రసుల పట్టీ తయారు చేశాను. ఉద్యోగం అంటూ వస్తే ఎవరి డబ్బు వారికి పంపిస్తాను. అంతవరకు మిమ్మల్ని మోసం చేసినందుకు క్షమించండి. నాకు ఉద్యోగమొస్తే మీ అప్పు తిరిగొస్తుందని సమాధానపడండి.

ఇట్లు

మీ శిష్యుడు

నిరుద్యోగ నాగరాజు"

తాజాకలం: నిరుద్యోగి నా ఇంటిపేరు కాదు! నాగరాజు అసలు పేరు కాదు!! సందర్భాన్ని బట్టి పేరు మారుస్తుంటాను. కానీ, నిజంగా నే కాలేజీలో మీ స్టూడెంట్‌నే, మీ శిష్యుణ్ణే!"

జాబు మడతపెట్టి, కణత నొక్కిపట్టి ఆలోచిస్తున్న నాకు- కాలేజీలు, యూనివర్సిటీలు, లెక్చరర్లు, ప్రొఫెసర్లు, విద్యార్థులు, డిగ్రీలు, నిరుద్యోగులు, ప్రభుత్వాలు కళ్ల ముందు కదిలాయి. కాలేజీలు నిరుద్యోగులను ఉత్పత్తి చేస్తున్న కార్ఖానాల్లా అనిపించాయి, భయం, అసహ్యం, కోపం, కసి, క్షోభ నా మనస్సులో చోటు చేసుకున్నాయి.

రేపటి నుండి కాలేజీకి వెళ్లాలంటే నాకు సిగ్గుగా జంకుగా ఉంది!

"ఎవరి నుండి ఉత్తరం, ఏమిటి సంగతులు" అంది వంటింట్లోంచి వచ్చిన నా శ్రీమతి. భయంకరమైన, దారుణమైన నిరుద్యోగ యువత పరిస్థితుల్ని గురించి చెప్పనా? లేక నేను సమర్పించిన "శిష్య దక్షిణ"ను గూర్చి చెప్పనా? ఏం చెప్పను? ■